# ప్రకృతి హారం

పదేళ్ళ తరవాత బస్సు దిగి వంద గజాలు నడచి ఒకచోట దర్శిద్దామంటే అంతా మార్పే. కొత్తగా కట్టిన రెండు ఓవర్‌బ్రిడ్జీలు, దిగువగా అయిదు రైలు లైన్లు పోతున్నాయ్. ఒక బ్రిడ్జీమీద ఆగి నిల్చొని చూస్తే పట్నం యెవరి వూహలో కోరికలుకాగా వుద్భవించిన ప్రకృతి హారంలా వుంది. ఆ హారంలో ఒక సగం పచ్చదనంతో నిండిన కొండవారల్లో పొగలు గక్కుతున్న భారీ పారిశ్రామిక సంస్థలు! ఇంకా పడమటి ప్రొద్దు యీ పొగలను మింగి విలవిల్లాడి పోలేదు. అందుకే తూరుపు దిక్కున నీటితుంపరలలో కదలుతున్న చెదురు మేఘాల్లో రెండు హరివిల్లులు పొడిచాయి. అటు పొద్దు, యిటు హరివిల్లుల రంగుల్లో అందినవి అందుకుని బ్రిడ్జికి రెండు ప్రక్కలా వున్న గుల్‌మొహర్ చెట్లు గాలికి మెల్లగా తలలాడిస్తున్నాయ్.

ఈ అయిదో నెంబరు నేషనల్ హైవే మీద నడుస్తున్నవి నడుస్తున్నయ్; పరుగెత్తుతున్నవి పరుగెత్తున్నాయ్. బసవరాజు ఆలోచనలూ అలానే వున్నాయ్. నల్లని గేదె పొదుగు చూస్తే రోజుకు పదిశేర్లు యిచ్చే గేదెలా వుంది. యజమాని యెత్తుకున్న గేదె పెయ్య ముందున పోతుంటే వెనుక పరుగెత్తుతోంది.

ఆ గేదె లేకపోతే - ఆ పెయ్యగతి? తను చనుబాలు కుడిచి యెదుగుతున్నప్పుడు తల్లిని పోగొట్టుకున్నాడు. లోలోన ముసుగువేసుకున్న కోరిక వయసు పెరుగుతుంటే బలహీనతగా బయటపడింది. తను పెళ్ళాడితే గేదె లాంటిదాన్నే చేసుకోవాలి?

ఎర్రని గోళం నలుపెక్కుతోంది. పడమటి ఆకాశం ప్రతిక్షణం రంగులు మారుస్తోంది. అంతదూరంలో రైలుబండి, ఏడయికొండలు యేకమై కదలివస్తున్నట్లున్నాయ్. ముగ్గురు రాక్షసులు రైలింజనులై అరుస్తూ లాగుకుంటూ వస్తున్నాయ్. రైలు తన పాలిట రాక్షసి. అందుకే బసవరాజు రైలెక్కాడు. ఒకసారి యెక్కడానికి ప్రయత్నిస్తే గుండెదడ పట్టుకుంటే దిగిపోయాడు. ఈ రాక్షసి యిప్పుడు తన పాదాలక్రింద నించి ప్రాకుతూపోతోంది. ఎంతో గర్వంతో నవ్వుకుంటే - ఒక తెల్లని దూడ, రైలు ముందు పట్టాలమీద దూరంగా గెంతుతోంది. రైలు దగ్గరౌతున్నా యింకా పట్టాలు వదలటంలేదు. ఇంజనుకూతతో యింకా బేజారెత్తి గెంతుతోంది. బసవరాజులో రైలు చక్రాలు కదలుతున్నాయ్. రైలు ఆగలేదు. దూడ ప్రక్కకు ఒరిగిపోయింది. చావలేదు. దాని కాళ్ళు తెగిపోయి వుంటాయి. గజ గజ వణికిపోయాడు. అలా ఒరిగిపోయి కూర్చుండిపోయాడు. రైలు తనమీద నించే పోతున్నట్లు కళ్ళుమూసుకుని కేకవేశాడు. శరీరమంతా ముచ్చెమటలు పోసాయ్. కాలసర్పంలా మార్షలింగు యార్డువైపు మెల్లగా పోతున్న రైలువైపు చూసి ముఖం రెండోవేపు త్రిప్పేశాడు.

మార్షలింగు యార్డులో యెత్తయిన స్తంభాలపైనున్న లైట్ల సమూహం ఒక్కసారి వెలిగాయ్. మైకులో 'ఆగండి ఆగండి' అని అరుస్తూ డ్రయివరుకు ఆదేశాలిస్తున్నాడు కేబిన్ నించి యెవరో! తను ఆరో క్లాసు చదువుకుంటున్న రోజుల్లో యీ పరిసరాల్లో వుండేవాడు. స్కూలు నించి వస్తూ రైలు లైన్లు దాటుతున్నప్పుడు యీ దూడలానే ఒరిగిపోయాడు. రెండు కాళ్ళను రైలు పిప్పి చేస్తే ఆసుపత్రిలో ఆ కాళ్ళను కోసి సరిచేసారు.

"బసవరాజు దురదృష్టవంతుడు. పుట్టాక తల్లిని మహమ్మారికి అప్పచెప్పాడు. తండ్రిని విషనాగు కాటుకు అందిచ్చాడు. వాడు రైలు రాకానికి రెండు కాళ్ళు బలి చేశాడు'' అన్నాడు పినతండ్రి.

ఆ పినతండ్రి యింతే నేను చెయ్యగలనన్నాడు. వాడికి యేకోశానా యింత పిసర అదృష్టం అంటకపోతే యేంచేసినా ఫలించదని పినతల్లి బయటకే అనేసింది. రెండు చంకల్లో రెండు కర్రలూ పెట్టుకుని స్కూలుకు వెళ్ళేవాడు. తోటి పిల్లలు అనుకుంటుంటే కదలని కాళ్ళు కన్నీటిని తెప్పించేవి. హెడ్ మాష్టారు నలుగురిలా అయ్యో పాపం అనలేదు. ఒకరోజు తన యింటికి తీసుకవెళ్ళాడు.

"ప్రతి మనిషి జీవితంలో యేదో ఒకటి పోగొట్టుకుంటుంటాడు. కాళ్ళు పోయాయని యేడుస్తున్నావుకదూ? అవి నీ కాళ్ళయితేగా?'' అన్నాడు.

''నా కాళ్ళు- నావి నావి'' అంటూ కన్నీరు కారిపోయాయి.

"నీ కాళ్ళయితే వుండేవి. నీ అసలు కాళ్ళు తయారౌతున్నాయ్. ఓర్చు" అన్నాడు.

తనే పదుగుర్ని చూసి చందాలు వసూలుచేసి పూనా ఆర్టిఫిషియల్ లింబ్ సెంటర్‌కి పంపించాడు. కృత్రిమ కాళ్ళతో నడక నేర్చుకుంటున్న పసిపిల్లాడిలా ఫీలయ్యాడు. ఈ కాళ్ళతో మెల్లగా నడవగలుగుతుంటే, సైకిలు తొక్కగలుగుతుంటే నిరాశపోయి ఆశ పుంజుకుంది.

గతం తల్చుకుని కూర్చుంటే నీడలు కదలుతున్నట్లు బ్రిడ్జిపై మనుషులు కదలుతున్నారు. లైట్లతో కార్లు, లారీలూ చర్రున ప్రాకిపోతున్నాయ్. గాలి బాగా వీస్తోంది. వెళ్ళిపోదామంటే ఆ దగ్గరలో నున్న కొలనునుంచి ఒక జంట వాగుకుంటూ పకపక నవ్వుకుంటూ తన దగ్గరలోనే బ్రిడ్జిమీద గాలికోసం నిల్చున్నారు. మగని చేతిలో టార్చిలైటు వుంది. ఒకసారి దిగువనున్న రైలు పట్టాలమీద టార్చిలైటు పోనిచ్చి తరవాత ప్రియురాలి మీద వేశాడు. ఆమె బుగ్గలు యెర్రగా కందినట్లు కనిపించినా ఆవిడ నవ్వూ, సిగ్గూ, మాటా, అభినయం అన్నీ ఆవేళ చూసిన హరివిల్లును గుర్తు చేశాయ్. దోమతెరలాంటి చీర, బెత్తెడు వెడల్పు చేతుల్లేని జాకెట్టు ఆమె అందంగా వున్న అవయవాలను గాలి పీల్చడానికి వదలినట్లు కనిపిస్తున్నాయ్. ఆమె మాటల్లో అంత్యప్రాసలు, ప్రేమ కవిత్వం వున్నాయ్.

"చూడండి, మా వూర్లో క్వీన్స్ నెక్‌లెస్ కన్నా- ఈ లైట్లు చుట్టూ చూస్తుంటే నేచర్సు నెక్‌లెస్‌లా లేదూ?" అంది ఆమె, పడమర భారత హెవీ ప్లేట్స్‌నించి తూరుపువేపు హార్బరు వరకూ వ్యాపించిన లైట్ల తోరణాన్ని చూపిస్తూ!

ఆమె కైవారం పెద్దది. అతని గొంతుక పెద్దది. అతనన్నాడు-"దూరపు కొండలు నునుపు. ఇంత డర్టీ సిటీని నేనెక్కడా చూడలేదు. అంటూ టార్చిలైటు ఆమె మెడలో హారంపై వేశాడు

"మహానుభావా! ఇంత అందమైన నెక్‌లెస్ నీ భార్య పైట చాటున వుంటే- ఈ నేచర్సు నెక్‌లెస్ నీకెందుకు నచ్చుతుంది?" అని అనబోయి, కాస్త దగ్గరౌతుంటే, "రా పోదాం" అని ఆమె నడుం పట్టుకుని మరీ వెళ్ళిపోయాడు అతను.

ఈ తెల్లగేదె బసవరాజులో ఒక విధమైన అలజడిని లేవదీసింది. ఖేదమూ మోదమూ రెండూ కలసి కళ్ళల్లో మెరశాయి. ఆ కంటికి ఆ చీకట్లో గుల్ మొహర్ చెట్టుక్రింద కూర్చున్న యింకో భామ వెళ్ళిపోతున్న లారీ వెలుగులో కనిపించింది.

అటువేపు మెల్లగా కదిలాడు. ఆమె ఒంటరిది. అతనిని చూసి ఆ జంటలా కదలి పోలేదు. ఇంకో లారీ పోతుంటే ఆ వెలుగులో యవ్వనంతో పొంగిన ఆమె శరీర మంతా కనిపించింది. ఆ చెట్టు ప్రక్కనే దిగువకు దిగడానికి మెట్లున్నాయ్. ఆ మెట్లుదిగి బ్రిడ్జి క్రిందకు పోవచ్చు. తను కల్లోల జలధిలో లేస్తున్న కెరటంలా వున్నాడు. ఇంకో లారీ- మరో లారీ.... ఆ వెలుగులో ఆమె వాల్చిన పైట నేచర్స్ నెక్లెస్!

ఆమె గేదెలా వుంది. ఆకలి తీర్చుకోడానికి యిలా గడ్డిమేస్తోందని ఆమె చేత ఐదురూపాయల కాగితం పెట్టాడు. ఆమె మెల్లగా మెట్లు దిగుతుంటే ఆమె భుజంమీద చెయ్యి వేశాడు. మెట్లు మెల్లగా దిగి బ్రిడ్జి క్రిందకు వెళ్ళారు. చీకటి గోడల మధ్య ఆమె మూలుగుతోంది. ఆ మూలుగు మూగజంతువు రోదనలా వుంది. ఇంతలో బసవరాజు ముఖంమీద గేదె పాలులాంటి పాలుపడ్డాయ్. దానితో బసవరాజు చిన్న పిల్లవాడై పోయాడు. ఆమె చనుబాలు తల్లి పాలులా తాగేశాడు

కొంతసేపయ్యాక బాధ తగ్గినట్లు ఆమె నిట్టూర్చింది. తరవాత వెక్కి వెక్కి యేడుస్తోంది. ఏమీ చెప్పదు. కొద్ది క్షణాలు పోయాక మెల్లగా....

"రోజులపిల్ల.... రాతరే పోనాది.... ఆకలి.... ఆకలి....ఐనా యీ పాలు రొమ్ములో గడ్డకట్టిపోయి.... యమబాధ- ఎవరివోగానీ.... దేముడినాగ వచ్చినావు. నా రెండు బాధలు తీర్చినావు. నీ మెడలో పూలారం యెయ్యడానికి- నా దగ్గర పువ్వులు లేవు బాబో!" అని యేడ్చింది.

బసవరాజు లేచి నిల్చున్నాడు. "నివ్వు ప్రకృతిహోరానివి - నా తల్లివి" అంటూ అలా రైలుపట్టాలు దాటి నడుచుకుంటూ చీకట్లో పోయాడు. *

(1978)